# భేషజం



శ్రీమతి ఎం. ఉమారాణి

"ఏమండీ విజయగారూ!"

ఏదో పుస్తకం తిరగేస్తూ హాల్లో కుర్చీలో కూర్చున్న విజయ తలెత్తి చూసింది. గుమ్మంలో పక్కింటి మేష్టారుగారి భార్య పార్వతి చేతిలో చిన్న కప్పుతో నిలబడి ఉంది. ఆమెను చూడగానే ముఖం చిట్లించింది విజయ. 'మళ్ళీ ఏదో అప్పు కోసం కాబోలు!' అనుకొంటూ లేచి గుమ్మం దగ్గరికి వెళ్ళి "ఏమిటండీ?" అని అడిగింది. పార్వతి ఆమెవైపు చూసింది. ఆమె ముఖం సీరియస్‌గా ఉంది. అడగాలా వద్దా అని సంశయిస్తూనే "ఈరోజు అనుకోకుండా బంధువులు వచ్చారు. కాఫీపొడి పొద్దున్నే అయిపోయింది. ఈ చిన్న కప్పుతో ఇస్తారా? మళ్ళీ తేగానే ఇచ్చేస్తాను" అంది బిడియపడుతూ. "సారీ! లేదండి. మా యింట్లో కూడా అయిపోయింది. తెప్పించాలి" అంది విజయ ఉన్నా కూడా లేదని అబద్ధం చెబుతూ. ఉస్సురనుకొని వెళ్ళిపోయింది పార్వతి. "నెలాఖరనగానే అప్పుకు బయలుదేరుతుందీవిడ! ఇక్కడ నేనేదో స్టాకు పెట్టినట్లు! కాస్త పొదుపుగా వాడుకో కూడదూ" అని విసుక్కొంటూ లోపలకు వెళ్ళింది విజయ.

విజయకి గుమస్తా, టీచర్లలాంటి చిన్న ఉద్యోగస్థుల భార్యలతో మాట్లాడటమంటే నామోషీ. ఆ చుట్టు ప్రక్కల నివసించే వారంతా దాదాపు మధ్య తరగతి కుటుంబీకులే. పక్కింటి పార్వతిగాని, ఎదురింటి రేవతిగాని బయట నిల్చొని ఉన్నప్పుడు నవ్వితే తను నవ్వదు. ఎవరో ఎరగనట్లే ప్రవర్తిస్తుంది. పలకరిస్తే ఏవో రెండు ముక్కలు మాట్లాడి వెంటనే వెళ్ళిపోతుంది. లేదా ఇష్టం లేనట్లు ముఖం తిప్పేసుకొంటుంది. ఒక వేళ ఏదైనా పని ఉండి వాళ్ళువస్తే లోపలికి రమ్మని కూడా పిలవదు. వరండాలోనే మాట్లాడి పంపేస్తుంది. అంత భేషజం విజయకి. పోనీ తనేమైనా పెద్ద ఆఫీసరు భార్యనా–అంటే అదీకాదు. ఒక పెద్ద గుమస్తా భార్య! అయినా తను గుమస్తా భార్య కానట్లే ప్రవర్తిస్తుంది. ఎంతసేపు పెద్దవారి స్నేహం కోసం పాకులాడుతుందామె. వాళ్ళతో ఎలా స్నేహం సంపాదించాలా అనే ఆలోచిస్తుంది. అంతేగాని, తన అంతస్తులో ఉండేవారితో కలిసి ఉండటం ఇష్టపడదు. అక్కడున్న వారిలో చాలా మందికి ఆమె బుద్ధి తెలిసిపోయింది. అందుకే ఆమె ఇంటికి సామాన్యంగా రారు. పక్కింటి పార్వతిది గంపెడు సంసారం. దానికి తగినట్లు భర్తకు జీతం వచ్చి ఆరు నెలలైంది. అతను ప్రైవేట్లు చెప్పగా వచ్చే డబ్బుతో ఎలాగో గడుపుకొని వస్తున్నారు. నెలాఖరు రోజులలో ఆమె అప్పుకోసం వెళ్ళక తప్పదు. విజయకు ఆమె సంగతి తెలుసు. అయినా జాలిపడి సహాయం చేయదు. కారణం! ఆమె అంటే విపరీతమైన చులకన.

'మహిళా మండలిలో చేరితే బాగుంటుంది–అందులో అందరూ ఆఫీసర్ల భార్యలే మెంబర్లై ఉంటారు. ఎంచక్కా అందరితో పరిచయం సంపాదించుకోవచ్చు అనుకుంది విజయ. ఇంతలో మామగారికి జబ్బుచేసి మంచం మీద నుండి లేవలేని పరిస్థితి అయ్యేటప్పటికి చేసేది లేక ఊరుకొంది. విజయకి ఇద్దరు పిల్లలు. భర్త ప్రసాద్ గుమాస్తా అయినా సంసారం చిన్నది కావడంతో నెలాఖరు రోజులలో ఇబ్బంది పడేవారు కాదు. నెల నెలా డబ్బు పొదుపుచేసి గాస్, కుక్కరూ కొన్నది. అవి ఆ చుట్టు ప్రక్కల ఇండ్లలో ఎవరికీ లేక పోవడం వలన ఆమెకు గర్వం మరింత హెచ్చింది.

ఎదురింటి రేవతి వాళ్ళకి గుంటూరు ట్రాన్స్‌ఫర్ అయి, వెళ్ళిపోయారు. వెళ్ళేముందు రేవతి విజయకు అసలు చెప్పలేదు. విజయ అందుకు ఏమీ బాధపడలేదు. రేవతి వాళ్ళు వెళ్ళిన నాలుగు రోజులకు దివాకర్ అనే డాక్టర్ ఆ ఇంట్లో దిగాడు. ఆరోజు ఉదయం విజయ వంటపనంతా ముగించుకొని వరండాలో నిలబడి ఉంది. ఇంతలో ఎదురింటి దగ్గర ఒక కారు, దాని వెనుకనే ఒక లారీ వచ్చి ఆగాయి. కారులోంచి ఒక యువకుడు, ఒక యువతి, ముగ్గురు పిల్లలు దిగి లోపలకు వెళ్ళారు. అందరూ మంచి ఖరీదైన దుస్తులలో మెరిసి పోతున్నారు. లారీలోంచి సామానులన్నీ దింపి లోనికి తీసుకెళ్తున్నారు కూలీలు. "అబ్బా! మంచి మంచి ఖరీదైన సామాన్లే ఉన్నాయే! అరే! ఫ్రిజ్ కూడా ఉంది! ఈయన తప్పకుండా ఆఫీసరే అయ్యుంటాడు" అనుకుంది విజయ. ఆమెకు చాలా సంతోషం వేసింది. ఇన్నాళ్ళకు తనకు సరియైన వాళ్ళు వచ్చారు అనుకొంది. రెండో రోజున భర్త ద్వారా ఎదురింటి అతను డాక్టర్ అని తెలుసుకొంది. ఆమెకు మరింత సంతోషం కలిగింది. డాక్టర్‌గారి భార్య బాగుంటుంది నాజూగ్గా. ఆమెతో ఎలాగైనా స్నేహం చేయాలి. అందులో వాళ్ళకి కారు కూడా ఉంది. కారంటే విపరీతమైన పిచ్చి విజయకు. ఆరోజు రాత్రి ఆమెకు డాక్టర్ భార్యతో కలిసి

కారులో కూర్చుని సినిమాలకు, షికార్లకు తిరిగినట్లు కల కూడా వచ్చింది.

మరుసటి రోజు భర్త ఆఫీసుకి వెళ్ళగానే ఇంటి పనంతా ముగించుకొని వరండాలో నిలబడింది విజయ–ఎదురింటివైపు చూస్తూ. పిల్లలు ముగ్గురూ వరండాలో ఆడుకొంటున్నారు. ఎంతో సేపు చూసింది-ఆవిడ బయటికి వస్తుందేమో పలకరిద్దామని. కాని రాలేదు. విసుగేసి లోపలికి వెళ్ళిపోయింది. మధ్యాహ్నం రెండు మూడు సార్లు బయటకు వెళ్ళిచూసింది. కాని ఆవిడ జాడేలేదు. "ఇదేవిఁటి? ఒక్కసారి కూడా బయటకు రాదేమిటి? ఒకవేళ సామాన్లన్నీ సర్దుకొనే హడావిడిలో ఉందేమో" అని సరిపెట్టుకొంది. సాయంత్రం భర్త రాకకోసం ఎదురుచూస్తూ వరండాలోకి వచ్చిన విజయకి అల్లరి చేయక ఆడుకోండని పిల్లల్ని కేకలువేస్తూ ఆమె కనిపించింది. ఆమెను చూడగానే విజయ ముఖం చాటంత అయ్యింది. వరండామెట్ల దగ్గరికి వచ్చి నిలబడింది–తనను ఆవిడ చూడాలనే ఉద్దేశంతో. కాని ఆవిడ అసలు విజయవైపు చూడకుండానే లోపలికి వెళ్ళిపోయింది. విజయ నిరాశపడిపోయింది. నాలుగు రోజులు గడిచినా ఆవిడ పరిచయ భాగ్యం కలిగే అవకాశం రాలేదు విజయకు. ఒకసారి ఆవిడ బయట గేటు దగ్గర నిల్చొని ఉన్నప్పుడు విజయ చూసి నవ్వింది పలకరింపుగా. కాని ఆవిడ చూసీ చూడనట్టు చూసి అవతలకు వెళ్ళిపోయింది. చివుక్కుమనిపించింది విజయకు. ఒకవేళ ఆవిడ తనని సరిగ్గా గమనించలేదేమోనని సరిపెట్టుకొంది మనసుని. ఆవిడ సామాన్యంగా బయటికి రాదు–ఎప్పుడో తప్ప. అందుకే ఇలా లాభం లేదు. తనే వెళ్ళి పరిచయం చేసుకోవాలి అనుకొంది.

ఆ రోజు సాయంత్రం కొత్తగా కొన్న నిల్ప్రింటెడ్ చీర కట్టుకొని, బాగా ముస్తాబై బయటకు వచ్చింది విజయ. పక్కింటి పార్వతి, డాక్టరింటి పక్కన ఉండే వనజ బయటనే నిలబడి ఉన్నారు. వాళ్ళవైపు ఓసారి గర్వంగా చూసి డాక్టరింటి కేసి నడిచింది. బయట ఎవరూలేరు. అక్కడే ఒక నిమిషం నిలబడి "ఏమండీ" అని పిలిచింది. సమాధానం రాలేదు. మళ్ళీ రెండు మూడు సార్లు పిలిచింది. కాసేపటికి చిన్నపాప బయటికి వచ్చి 'ఎవరు కావాలి?" అని అడిగింది. "మీ అమ్మగారు ఉన్నారా పాపా?" అంది విజయ. "ఉన్నారు" అని తుర్రుమంటూ లోపలికి పరిగెత్తింది. రెండు నిమిషాలకు డాక్టర్‌గారి భార్య బయటకువచ్చింది. "ఎవరండీ?" అంది విజయవైపు ప్రశ్నార్థకంగా చూస్తూ. "నేను మీ ఎదురింట్లో ఉంటున్నానండీ" అంది విజయ. "ఓహో!" అంది ఆమె. తనని లోపలికి రమ్మంటుందేమోననుకొంది విజయ. కాని ఆమె అలా రమ్మనలేదు సరికదా కూర్చోమని కూడా చెప్పలేదు.

"ఏమిటిలా వచ్చారు?"

"ఆ ఏమీలేదు ఊరికే తోచక."

కాస్సేపు నిశ్శబ్దం రాజ్యమేలింది ఇద్దరిమధ్య.

"మీరు ఇంతకు ముందు ఎక్కడ ఉండేవారు?" అంది విజయ ఆ నిశ్శబ్దాన్ని భరించలేక.

"రాజమండ్రిలో."

"మేమూ ఇంతకుముందు రాజమండ్రిలోనే ఉండేవాళ్ళం!"

"ఓహో అలాగా!" అందామె నిర్లిప్తంగా.

"ముగ్గురేనా పిల్లలు?"

అవునన్నట్లు తల ఊపింది. "ఏం చదువుతున్నారు?"

వాళ్ళ చదువులగురించి చెప్పి "కాన్వెంటులో చదువుతున్నారు" అంది. ఆమె సమాధానంలో గర్వం తోచింది విజయకు.

"మీ పేరేమిటో తెలుసుకో వచ్చా?"

"సునీత" అందామె.

"మీ పేరేమిటి? మీకు పిల్లలు ఎంత మంది?" అని తనను అడుగుతుందేమోనని ఎదురు చూసింది విజయ. కాని ఆమె ఏమీ అడగలేదు. విజయే తన పేరు చెప్పుకొంది. తరువాత వాళ్ళిద్దరి మధ్య మాటలు సాగలేదు. విజయకు బలే విసుగేసింది. ఎంతసేపూ తనే మాట్లాడుతోంది. ఆమె అంటీ ముట్టనట్లు సమాధానం చెబుతోందే కాని, తన గురించి తెలుసుకోవాలనే ఉత్సాహం చూపడంలేదు. "ఏమిటో కలుపుగోరు మనిషిలాలేదు" అనుకొంది నిరుత్సాహంతో. కాసేపు అలాగే మాటా మంతీ లేకుండ నిలబడి "వస్తానండి కొంచెం పనుంది" అని లోపలికి వెళ్ళిపోయిందావిడ. విజయ ఆశ్చర్యంగా నిలబడిపోయింది. సునీత ప్రవర్తన ఆమెకు చాలా బాధకలిగించింది. "ఈమెకు కనీసం మర్యాద కూడా తెలిసినట్లు లేదు" అనుకొంటూ చిన్నబోయిన ముఖంతో వెనుదిరిగింది. ఎదురుగా గేటు దగ్గర నిలబడి పార్వతి తననే చూస్తోంది. ఆమెను చూడగానే విజయ తల అవమానంతో వంగిపోయింది. గబ గబా నడుచుకుంటూ ఇంట్లోకి వెళ్ళిపోయింది విజయ. అన్నం కూడా సయించలేదు. అలాగే మంచంపై పడుకుండిపోయింది.

"ఏమిటిది విజయా? గుమ్మం తలుపులు అలా తెరిచేసి ఉంచి గదిలో పడుకుంటే ఎలా? ఎవరైనా ఇల్లు దోచుకుపోయినా దిక్కులేదు" అంటూ గదిలోకి వచ్చాడు అప్పుడే ఆఫీసు నుండి భోజనానికి వచ్చిన ప్రసాద్. "అయ్యో! మరిచేపోయాను నా మతి మండా" అని నొచ్చుకొంటూ లేచి వంటింట్లోకి నడిచింది. ప్రసాద్ భోజనం చేశాక విశ్రాంతిగా పడకకుర్చీలో కూర్చున్నాడు. విజయ కూడా ప్రక్కనే వచ్చి కూర్చొంది.

"ఏమిటివాళ అలా ఉన్నావు?" అని అడిగాడు ప్రసాద్.



చీరాలలో యార్లగడ్డ అన్నపూర్ణమ్మ ప్రభుత్వ స్త్రీల కళాశాలలో బి. ఎ. (మూడవ సంవత్సరం) చదువుతున్న––ఊటుకూరి ఉషారాణి ఇటీవల ప్రకాశం జిల్లా కళాశాలల విద్యార్థుల వక్తృత్వ పోటీలలో పాల్గొని ప్రథమ బహుమతి పొందింది. అలాగే బచ్చు వెంకటేశ్వర్లు మెమోరియల్ కాలేజీ విద్యార్థుల వక్తృత్వపోటీలోనూ, ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంగా జరపబడ్డ అంతర్ కళాశాలల వక్తృత్వ పోటీలలోనూ కూడా పాల్గొని, ప్రథమ బహుమతులు గెల్చుకున్నది!

### వయసెంత ?

ఉత్సాహవంతురాలైన ఒక అమ్మాయి—తన అభిమాన రచయిత్రిని కలుసుకుని అవీ, ఇవీ మాట్లాడింది. మాటల సందర్భంలో "మీ వయస్సెంతండీ?" అని కూడా అడిగేసింది—అమాయకంగా. ఆ మాట అడగ్గానే రచయిత్రికి కోపం లాంటిది వచ్చినా, తగ్గించుకుని-ప్రసన్నంగా "చూడమ్మాయ్! ఆడవాళ్ళని వయస్సు, మగవాళ్ళని జీతం అడక్కూడదని నీకు తెలీదా!" అంది. "సారీ అండీ.... తెలుసుననుకోండి .... క్షమించండి. అయినా ఏదో ధోరణిలో...." అని నసిగేసింది. మరి కొంత సేపు వాళ్ళిద్దరూ మాట్లాడుకున్నాక—"మీకు ఎన్నో ఏట వివాహమైందండీ?" అని అడిగింది అమ్మాయి. "పందొమ్మిదో ఏట. రచనలు చెయ్యడం తగ్గిపోతుందేమోనని భయపడ్డాననుకో. కాని, అప్పట్నుంచే రాయడం అధికమైంది" అన్నది రచయిత్రి. అమ్మాయి చిన్నగా నవ్వేసి—"అయితే మరి, పెళ్ళయి ఎన్నేళ్ళవుతుందండీ?" అని ఇంకో ప్రశ్న వేసింది. "ఎక్కడమ్మాయ్!—ఇరవై నాలుగేళ్ళవుతుంది" అన్నది రచయిత్రి గొప్పగా. "అయితే మీ వయసు నలభై మూడేళ్ళన్నమాట!" అని ఛట్టుక్కున తేల్చేసి—ఆమె కేసి అదోలా చూసింది అమ్మాయి.

"చూడండి. ఎదురింటికెళ్ళాను పరిచయం చేసుకొందామని. కాని ఆవిడ సరిగ్గా పలకరించనే లే"దని తమ సంభాషణ గురించి చెప్పింది.

"ఎంతైనా డాక్టర్ భార్య కదూ! గర్వం ఉండనే ఉంటుంది. అందుకే ఆవిడ గుమాస్తా భార్యలతో మాట్లాడ్డానికి నామోషీ పడుతోందేమో నీలాగ" అని ఒక్క చురక అంటించాడు. విజయకు తన ప్రవర్తన గుర్తుకువచ్చి చుర్రుమంది. అయినా ఈ గుమాస్తా భార్యలకీ, తనకీ సామ్యం ఏమిటని వెంటనే సరిపెట్టేసుకుంది. "పెద్దవాళ్ళెప్పుడూ వాళ్ళ అంతస్తుకు సరితూగే వాళ్ళతోనే స్నేహం కలుపుతారు. తమ కంటె ఒక్క అంతస్తు తక్కువ ఉన్నా కేర్ చేయరని తెలుసుకో విజయా" అని అంటున్న భర్తని చురచుర చూస్తూ గదిలోకి వెళ్ళిపోయింది.

ఓ వారం రోజులు గడిచాక ఒక రోజు ఉదయం డాక్టర్ కూతురు వచ్చింది విజయ యింటికి. విజయ ఆనందంగా ఆహ్వానించింది. "ఆంటీ! మా అన్నయ్య పుట్టిన రోజు. మిమ్మల్ని సాయంత్రం పేరంటానికి రమ్మని అమ్మ చెప్పింది" అంది బొట్టు పెడుతూ. "అలాగేనమ్మా—తప్పకుండా వస్తాను" అంది నవ్వుతూ. ఆ అమ్మాయి వెళ్ళిపోయింది. మధ్యాహ్నం భర్త వచ్చి భోంచేసి వెళ్ళిపోయిన తరువాత తాను తయారై ప్రక్కనున్న బజారుకి వెళ్ళి చిన్న స్టీలుగ్లాసొకటి కొని తెచ్చింది బహుమతిగా ఇవ్వడానికి. సాయంత్రం ఐదు గంటలవగానే పట్టుచీర కట్టుకొని బాగా ముస్తాబై, పిల్లల్ని భర్తకి అప్పజెప్పి డాక్టరింటికి బయలుదేరింది. బయట రెండు కార్లు నిలబడి ఉన్నాయి. విజయ లోపలికి వెళ్ళింది. హాల్లో జంబఖానాలు పరచి ఉన్నాయి. మధ్యగా టేబుల్ ఉంది. దానిపైన బర్త్‌డే కేక్, కొవ్వొత్తులు అమర్చి ఉన్నాయి. ఒక ప్రక్క పార్వతి, వనజ ఇంకా ఆ చుట్టుప్రక్కల నివసించే మరో ఐదారుగురు గృహిణులు కూర్చొని ఉన్నారు. మరో ప్రక్క ముగ్గురు ఆడవాళ్ళు కూర్చొని ఉన్నారు – వీళ్ళతో మాకు సంబంధం లేదన్నట్లుగా. డాక్టర్‌గారి భార్య సునీత వాళ్ళ దగ్గర కూర్చొని కబుర్లాడుతోంది.

లోపలికి వచ్చిన విజయను చూసి "రండి కూర్చోండి" అని తిరిగి వాళ్ళతో మాటల్లో పడిపోయింది. విజయ, వనజ వాళ్ళవైపు నిర్లక్ష్యంగా చూసి ఈ నలుగురి దగ్గరకు వచ్చి కూర్చొంది. ఆ ముగ్గురినీ చూడగానే గ్రహించేసింది విజయ పెద్ద ఉద్యోగస్థుల భార్యలని. ఇంతలో ఇంకొకావిడ వచ్చింది. ఆమెను చూడగానే సునీత చిరునవ్వుతో లేచి ఎదురు వెళ్ళి "రండి రండి, ఇంత లేట్ చేశారేమిటి?" అంటూ ఎంతో ఆప్యాయంగా పలకరించి, ఆవిడను తమ దగ్గర కూర్చోబెట్టింది. "ఈవిడ ఇంజనీరుగారి భార్య కమలాదేవిగారు" అని మిగిలిన ముగ్గురికీ పరిచయం చేసింది. ఆ ముగ్గురినీ ఈవిడకి పరిచయం చేసింది. తనను కూడ పరిచయం చేస్తుందేమోనని ఎదురుచూసిన విజయ వంక ఆమె చూడనే లేదు! విజయ ఎంతో అవమానంగా ఫీలైంది. అసలు పక్కన ఒక మనిషి ఉన్నదనే ధ్యాస కూడా లేకుండా వాళ్ళు మాట్లాడుకోవడం చూస్తే చాలా బాధ వేసింది. 'అందరూ వచ్చేసినట్లే కదా!" అని సునీత లేచి ప్రక్క గదిలోకి వెళ్ళి తన కొడుకును పిలుచుకుని వచ్చింది. అతనితోపాటు అతని స్నేహితులు ఓ పది మంది దాకా వెంట వచ్చారు. వాళ్ళు "హాపీ బర్త్‌డే టూ యూ" అని పాడుతూంటే కొవ్వొత్తులను ఆర్పి, కేక్ కట్ చేశారు. సునీత ఆ కేక్ అందరికీ పంచింది. తరువాత పసుపు కుంకుమ ఇచ్చి, తాంబూలాలు అందించింది. వచ్చిన వారంతా ఆ అబ్బాయికి తాము తెచ్చిన బహుమతులను అందజేశారు.

తాంబూలాలు పుచ్చేసుకొన్న వెంటనే పార్వతి వాళ్ళు సునీతకు చెప్పి వెళ్ళిపోయారు. విజయ, తక్కిన నలుగురూ ఉండిపోయారు. సునీత పిల్లలందరికీ బిస్కెట్లు, చాక్లెట్లు పంచి వీళ్ళదగ్గరికి వచ్చింది. "ఇక వెళ్ళొస్తాం" అంటూ లేచింది కమలాదేవి, ఇంకొకామెతోసహా. "అదిగో అప్పుడేనా? ఇప్పుడేగా వచ్చింది, ఇంకాసేపు కూర్చోండి" అని బలవంతంగా వాళ్ళను కూర్చోబెట్టింది. వాళ్ళు తిరిగి తమ ఉద్యోగాల గురించి, హోదా గురించి మాట్లాడుకోవవడంలో మునిగిపోయారు. కాసేపు అలాగే వింటూ కూర్చొన్న విజయకు బలే విసుగేసింది. అక్కడ ఒక్క క్షణం కూడా కూర్చోలేకపోయింది. "ఏమండీ! నేను ఇంక వెళ్ళొస్తానండీ!" అంది లేస్తూ. "అలాగే" అంది సునీత. వెంటనే బయట పడింది విజయ. "ఛీ! ఛీ ఏం మనిషి? మర్యాదకు కూడా నన్ను కూర్చోమనలేదు" అనుకొని జరిగిన అవమానానికి కన్నీళ్ళు వస్తుంటే బలవంతంగా ఆపుకుంటూ ఇల్లు చేరుకుంది. అప్పుడుగాని తెలిసిరాలేదు విజయకు—తాము నిర్లక్ష్యంగా, చులకనగా చూస్తే ఎదుటివారు ఎంత బాధ పడతారో!